

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(సోమవారం)
కనిష్ఠం : 28

స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌కు ప్రణాళికను సిద్ధం చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 12(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు వివిధశాఖల అధికారులు జిల్లా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం కాకినాడ కమిషనర్ భావన, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు ఇతర అధికారులతో కలిసి స్వర్ణాంధ్రకి పారామీటర్స్‌పై వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్‌ప్లాన్ తయారీపై ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, టీంసభ్యులు జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రానున్న సంవత్సరంలో ఏ సెక్టార్‌లో అభివృద్ధి, వృద్ధిరేటు ఎలా ఉంటుందో అనే అంశంపై జిల్లా అధికారులు, నియోజకవర్గం ప్రత్యేక అధికారులు దృష్టిపెట్టి యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, సీపీవో త్రినాద్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'తో.. బాలికలకు భరోసా



పిఠాపురంలో ఈనెల 2న చిన్నారులకు కిశోరి వికాసంపై అవగాహన

- 12 అంశాలపై 12రోజులపాటు ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమాలు
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా రూపకల్పన
- వచ్చేనెల 10వరకు కార్యక్రమాలు
- 4న కిశోర బాలబాలికల తల్లిదండ్రులతో సమావేశాలు

కార్పొరేషన్(కాకినాడ), ఆంధ్రజ్యోతి: కౌమార దశకు చేరుతున్న బాలికలకు సమాజంలో ఆరోగ్య సమస్యలను, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి కిశోరి వికాసం అనే కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోంది. ఎన్నో కలలతో, మనసులో మరెన్నో సందేహాలతో బాలికలు ఎదుగుతున్నారు. 12ఏళ్ల నుంచి 18ఏళ్ల వయసు కలిగిన పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదిలాంటివారు. వారిలో శారీరక, మానసిక మార్పులతో కూడిన ఈదశ వారిని అనేక ఒత్తిళ్లకు గురిచేస్తోంది. సరైన దిశలో వారికి మార్గదర్శకం లభించకపోతే తప్పుడు మార్గాల్లోకి వెళ్లే అవకాశం ఉంది.

సాంకేతిక యుగంలోను ఒత్తిళ్లు

స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌వల్ల పిల్లలు వాస్తవ జీవితం నుంచి దూరమవుతున్నారు. ఫలితంగా ఒంటరితనంతోపాటు డిప్రెషన్, ఆత్మహత్య భావనలు వారిలో పెరుగుతున్నాయి. ఇటీవల వెల్లడించిన నిమ్హాన్స్ అధ్యయనం ప్రకారం బాలికల్లో మానసిక, ఆరోగ్య సమస్యలు 20శాతానికిపైగా ఉన్నట్లు వెల్లడైంది. ఆహార అలవాట్లు మారడం, జంక్ ఫుడ్ తినడంవల్ల పోషకాహార లోపాలు పెరుగుతున్నాయి. హిమోగ్లోబిన్ తక్కువ కావడంవల్ల రక్తహీనత పెరిగి బరువు తగ్గడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

బాలికలే లక్ష్యంగా మోసాలు

ఇటీవల బాలికలే లక్ష్యంగా మోసాలు అధికమయ్యాయి. ముఖ్యంగా ప్రేమపేరుతో కొందరు, వారిని వంచనకు గురిచేస్తున్నారు. మరికొందరు బాల్య వివాహాలు జరిపిస్తున్నారు. వీటిని అధిగమించేందుకు విద్య నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత తదితర 12 అంశాలపై 12రోజుల్లో అవగాహన కల్పించేందుకు కిశోరి వికాసం-వేసవి శిక్షణ కార్యక్రమాలు పేరుతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రణాళికలు రూపొందించింది.

జిల్లాలో 50,382మంది బాలికలు

జిల్లాలో మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 9ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 అంగన్‌వాడీ సెంటర్లున్నాయి. వీటి పరిధిలో 14నుంచి 18ఏళ్లలోపు 50,382మంది బాలికలు ఉన్నారు. వీరిని 2,542 గ్రూపులుగా ఏర్పాటు చేశారు. వీరికి పలుఅంశాలపై మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, డీఆర్పీ, వీఆర్పీ, ఎంపీహెచ్ఎబ్ల్యూ సిబ్బందితో కూడిన బృందాలుఅవగాహనకార్యక్రమాలు చేపడుతున్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తాం

బాలికలను అప్రమత్తం చేయడానికి ప్రభుత్వం అవగాహన కల్పించాలని నిర్ణయించడం మంచి పరిణామం. వేసవి సెలవులను వారికి ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారిలో మార్పుకు శ్రీకారం చుట్టాం. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు పరిష్కరించుకునేలా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటాం.

-కె.విజయకుమారి, పీడీ, ఐసీడీఎస్, కాకినాడ

బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడేనా?

వేసవిసెలవుల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం అనారోగ్య సమస్యలు, రక్తహీనత, ఇతర రుగ్మతలతో బలహీన సమాజానికి దారులు వేస్తున్నారు. బాల్య వివాహాలు నేరమే అయినా తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంవల్ల ఈ తతంగం సాగుతోంది. ఇందుకు నిదర్శనం 2023లో వచ్చిన ఫిర్యాదు లమేరకు 44బాల్యవివాహాలు, 2024లో 21బాల్య వివాహాలు, 2025 ఇప్పటివరకు 40 ఫిర్యాదులురాగా 36వివాహాలు అడ్డుకున్నారు. వివాహం జరిపించిన నలుగురిపై కేసులు నమోదు చేశారు. బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా వారికి పుట్టిన పిల్లలు బలహీనంగా పుడతారని వైద్యులు చెబుతున్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఎక్కడైనా, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నా, ప్రోత్సహిస్తున్నా 1098టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదుచేయవచ్చు.

కార్యక్రమాలిలా...

- మే 2న బాలికల సమష్టి పరిచయం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం(పూర్తైనవి)
- 6న రుతుక్రమం పరిశుభ్రత, లైంగిక విద్యపై అవగాహన(పూర్తైనవి)
- 9న పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్యవివాల కలిగే దుష్ప్రభావాలు(పూర్తైనవి)
- 13న బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన
- 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- 20న ఆడపిల్లలపట్ల లింగ వివక్ష, అసమానతలపై అవగాహన
- 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం
- 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు ఎదుర్కోవడం
- 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై అవగాహన
- జూన్ 3న కౌమార బాలిక నాయకత్వం, సాధికారతపై అవగాహన
- 4న రాష్ట్రవ్యాప్తంగా కిశోరి బాల, బాలికల తల్లిదండ్రులతో సమావేశం
- 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యంపై అవగాహన
- 10న బాల్య వివాహాలవల్ల కలిగే దుష్ప్రభావాలు, నివారణపై అవగాహన

టెంపుల్‌గా.. పెట్టండి!

భక్తజన..భోజనంబు!





భక్తుల కడుపు నింపండి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలల్లో భక్తులు వస్తుంటారు. ఏటా కోట్లలో విరాళాలు అందు తున్నాయి. ప్రస్తుతం అన్నవరం, వాడపల్లి ఆలయాలకు వేలాదిగా వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.అన్నవరం కొండపై నిత్యం నాలుగు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం అమలవుతోంది. వాడపల్లిలో శని,ఆదివారాల్లో 50 వేల వరకు, మిగిలిన రోజుల్లో 10 వేల మంది వరకు భక్తులకు అన్నదానం అందుతోంది. ఈ రెండు ఆలయాలకు కొన్నేళ్లుగా భారీగా భక్తులు తరలివస్తోన్న నేపథ్యంలో మరింత మందికి పరిమితిలేని విధంగా అన్నదానం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.ఈ నెల 6న అన్ని ఆలయాల ఈవోలతో అమరావతిలో సమీక్షించిన సీ ఎం భక్తులకు ఇబ్బందిలేకుండా అన్నదానం అమలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈ రెండు ఆలయాల్లో భక్తులకు మరింత మందికి అన్న ప్రసాదం అందనుంది.

తిరుపతిలో తినలేకపోతున్నాం.. గత ప్రభుత్వంలో ఇదీ భక్తుల మాట.. ప్రభుత్వం మారింది.. అంతే అన్నదానం అమృతమయంగా మారింది. సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతిలో అన్నదాన ప్రసాదాన్ని అమోఘంగా మార్చారు. నాణ్యతగా ఉండేలా చూస్తున్నారు.. ఒక్క తిరుపతిలోనే కాదు.. జిల్లాల్లోని ప్రధాన ఆలయాల్లోనూ నిత్యాన్నదానం చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు ఆలయాల్లో నిత్యాన్నదానం చేయాలని ఆదేశించారు. అందులో ఒకటి అన్నవరం.. రెండోది వాడపల్లి. అలాగే తలుపులమ్మ లోవ ఆలయంపై నివేదికివ్వాలని సూచించారు. సీఎం ఆదేశాల అమలుకు అధికారులు పరుగులు పెడుతున్నారు.



- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- అన్నవరం, వాడపల్లిల్లో అమలు
- ఇప్పటికే వేలాదిమందికి అన్నదానం
- మరింత పెంచేందుకు సన్నాహాలు
- అన్నవరంలో నిధుల కొరత
- వాడపల్లిలో అన్నదానానికి ఓకే
- తలుపులమ్మ లోవపై నివేదిక
- 17న అమరావతిలో సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు పరిమితి లేకుండా నిత్యాన్నదానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ కడుపునిండా భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం చంద్రబాబు ఇటీవల దేవదాయశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో నిరంతరం భక్తులకు నిత్యాన్నదానం అందుతున్నా ఇకపై మరింతమందికి భోజనం అందించేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. అన్నవరం దేవస్థానానికి నిధుల కొరత వేధిస్తుండడం, భోజనశాలలు ఏమాత్రం సరిపోకపోవడంతో దీన్ని ఎలా అమలుచేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. వాడపల్లికి నిధులు పుష్కలంగా ఉండడంతో పరిమితి లేకుండా మరింత మందికి అన్నదానం అమలుచేయనున్నారు. తుని నియోజవర్గంలోని తలుపులమ్మ లోవ ఆలయంలో నిత్యాన్నదానం అసలు ఇంతవరకు లేదు. దీంతో త్వరలో అమలుకు వీలుగా సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం నివేదిక కోరింది.

అన్నవరంలో తర్జనభర్జన..

సీఎం ఆదేశాలను తక్షణం అమలుచేసే విషయంలో అన్నవరం దేవస్థానం అధికారులు తలపట్టుకుంటున్నారు. అన్నప్రసాదం సంఖ్య పెరిగితే ఆర్థిక భారం ఎలా మోయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. 1987లో సత్యదేవా నిత్యన్నదాన ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్‌లో రూ.64 కోట్లు ఫిక్సడ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిపై ఏటా రూ.4.5 కోట్లు వడ్డీ లభిస్తోంది. సాధారణ రోజుల్లో నాలుగు వేలు, శని, ఆదివారాల్లో 5 వేల నుంచి 6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. వడ్డన సిబ్బంది జీతభత్యాలతో కలిపితే ఒక్కో భోజనానికి దేవస్థానానికి రూ.34 వ్యయమవుతోంది. కార్తీకమాసం వంటి పుణ్యమాసాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ప్రస్తుతం లభిస్తున్న వడ్డీ డబ్బులు చాలీచాలనట్టుగా ఉన్నాయి. సీఎం చంద్రబాబుతో ప్రకటనతో పరిమితిలేని నిత్యాన్నదానం ఎలా అమలుచేయాలనేదానిపై ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అన్నవరంలో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ చేయాలంటే సుమారు రోజుకు 10 వేల మందికి అందించాల్సి ఉంటుంది. పైగా దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న భోజన హాలు చిన్నగా ఉంది. దీంతో నూతన అన్నప్రసాద భవననిర్మాణం ప్రసాద్ స్కీంలో రూ.11.50 కోట్లతో మంజూరైంది. తీరా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరే సింహాచలం ఘటనలో నాసిరకం పనులతో దొరికిపోవడంతో ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో అన్నవరం ప్రసాద్ స్కీం పనులు ఆగిపోయే పరిస్థితి తలెత్తింది. ఖర్చులన్నీ దేవదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అక్కడనుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా వ్యవహరిస్తామన్నారు.

వాడపల్లిలో ఓకే..

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి గడచిన కొన్నేళ్లుగా వేలల్లో భక్తులు పోటెత్తుతున్నారు. ఈమేరకు ఆలయంలో నిత్యాన్నదానం అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అపరిమిత అన్నదానం అమలు చేయాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో దీనికి తగ్గ సన్నాహాలను అధికారులు ఆరంభించారు. తుని నియోజకవర్గంలోని తలుపులమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ రద్దీ లెక్కలు సీఎం సమీక్షలో అధికారులు ప్రస్తావించారు. ఇక్కడ కూడా అన్నదానం అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ ఆలయంలో అసలు అన్నదానం అమలు కావడం లేదు. అన్నదానం అమలు సాధ్యాసాధ్యాలపై తలుపులమ్మ ఆలయ ఈవోను ప్రభుత్వం నివేదిక కోరింది. ఇక్కడకు ఆదివారం 10 వేల మంది వరకు భక్తులు వస్తారని.. మిగిలిన రోజుల్లో వెయ్యి మంది వరకు ఉంటారని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. పైగా ఈ ఆలయానికి వచ్చే భక్తులు సొంతంగా ఇక్కడే వండుకుని తినే ఏర్పాట్లతో వస్తారని.. అన్నదానం అవశ్యకత తక్కువేనని తెలిపారు. అయితే లోవలో అన్నదానం అమలు చేయాలా? లేదా? అనేదానిపై ఈనెల 17న అమరావతిలో జరగనున్న సమీక్షలో స్పష్టత రానుంది. ఆలయాల్లో భక్తులకు అందుతున్న సేవలు, భోజన నాణ్యతపై తరచుగా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తోంది. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉందని ఫిర్యాదులు వచ్చినా ఆలయానికి ఇచ్చే పాయింట్లను తగ్గిస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారాక అనేక ఆలయాల్లో అన్న ప్రసాదంలో నాణ్యత రెట్టింపుకావడంతో భక్తులు ఆనందిస్తున్నారు.

ఆసన్నమైంది!



- జూన్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు
- రబీ సీజన్‌లో బియ్యం సేకరణ ఆధారంగా సరఫరా
- తొలివిడత మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సన్న బియ్యం అందజేస్తామంటూ గొప్పలు చెప్పిన వైసీపీ సర్కారు అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఊరించి ఊరించి ఉసూరుమనిపించింది. ఇదిగో సన్నబియ్యం.. అదిగో సన్న బియ్యం అంటూ కాలం గడిపేసింది. లబ్ధిదారుల ఆశ నెరవేర్చకుండా వారి ఆశలపై నీళ్లుచల్లింది. గత సర్కారు చేయలేనిది తాము చేసి చూపిస్తామంటోంది కూటమి సర్కార్.. మరి కొద్దిరోజుల్లో సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేసేందుకు సన్నాహాలు చేస్తోంది. జూన్ 12 నుంచి సన్న బియ్యం పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ సన్నబియ్యాన్ని దశలవారీగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ముందుగా ప్రభుత్వ పాఠశాలు, సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ స్కూళ్లకు అందజేసేందుకు సిద్ధమవుతోంది.

తొలిసారిగా బియ్యం..

కాకినాడ జిల్లాలో తొలిసారిగా సన్న బియ్యాన్ని అందించే సమయం ఆసన్నమైనట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం రబీ సీజన్‌లో బీపీటీ 5204, ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, ఎంటీయూ 1224, ఎంటీయూ 3626 ఎస్ఎల్ఆర్ 34449, ఆర్ఎన్ఆర్ 15048 ఇలా సుమారు పది రకాల బియ్యం సాగు చేస్తున్నారు. వీటిలో బీపీటీ 5204 రకం 1711 హెక్టార్లలో, ఎంటీయూ 1224 రకం 345 హెక్టార్లలో, ఎస్ఆల్ఆర్ 34449 రకం 535 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. వీటిద్వారా 36,918 మెట్రిక్ టన్నుల బియ్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో వచ్చే సన్న బియ్యం సేకరణ ఆధారంగా మే నెల నుంచి ముందుగా మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీలకు సరఫరా చేయనున్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లలో..

కాకినాడ జిల్లాలో మొత్తం 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కాకినాడ అర్బన్‌లో 7540 మంది, కాకినాడ రూరల్‌లో 4945, జగ్గంపేట 5281, ప్రత్తిపాడు 3645, పిఠాపురం 6495, పెద్దాపురం 6201మంది పిల్లలు ఉన్నారు. ఆయా సెంటర్లలో అందులో ప్రతి చిన్నారికి రోజూ 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, ఐదు గ్రాముల ఆయిల్, వంద మిల్లీలీటర్ల మిల్క్, ఒక గుడ్డు అందజేస్తారు. వీరికి మే నెల నుంచి సన్న బియ్యం అందజేసే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లాలో 1281 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఈ బియాన్ని ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలు రకాల పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆహారాన్ని తయారు చేస్తుండగా.. ఇకపై సన్న బియ్యం అందించేలా కూటమి సర్కారు సన్నాహాలు చేస్తోంది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కాకినాడ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 20 వరకూ కొనసాగుతాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిణి(డీఐఈవో) ఐ.శారద తెలిపారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించామని ఆమె వివరించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటలవరకూ జరిగిన మొదటి సంవత్సరం తెలుగు-1, సంస్కృతం-1, హిందీ-1, ఒకేషనల్ జీఎఫ్‌సీ పరీక్షలకు జనరల్ విభాగంలో మొత్తం 4031మందికిగాను 3795 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 220మందికిగాను 204మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరిగిన ఇంటర్ రెండో ఏడాది పరీక్షలకు జనరల్ విభాగంలో మొత్తం 657మందికిగాను 605మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 98మందికిగాను 92మంది హాజరయ్యారన్నారు.

జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు



జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 47మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్ డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆ ఫిర్యాదులను ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

కలెక్టరేట్ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 373 అర్జీలు



ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల అర్జీలు పరిష్కరించేటప్పుడు జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మాత్ర మే ఎండార్స్‌మెంట్ వేయాలని సూచించారు. సక్రమంగా పరిష్కరించని వాటిని రెండుస్థాయిల్లో ఆడిట్ జరిపి మళ్లీ రీఓపెన్ చేస్తారని, అలా ఎక్కువ దరఖాస్తులు రీఓపెన్ చేసినశాఖ అధికారులకు మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. వివిధ అంశాలకు చెందిన మొత్తం 373 అర్జీలు అందాయన్నారు. అనంతరం జేసీ రాహుల్‌మీనా,డీఆర్వో వెంకట్రావు,జడ్పీ సీఈవో లక్ష్మణరావు అర్జీలను స్వీకరించారు. హౌసింగ్ పీడీ సత్య, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.





పొగ మంచు కురిసె.. పగలు మండే ఎండలు మంటపుట్టిస్తుంటే.. సాయంత్రం ఆకస్మికంగా వాన వచ్చేస్తోంది. ఈ విచిత్ర వాతావరణంతో జనం రకరకాల పాట్లు పడుతున్నారు. దీనికితోడు వేకువజామున పొగమంచు కురుస్తూ మూడు కాలాలను ఒకేసారి అనుభవంలోకి తెస్తోంది. మండపేట పట్టణంలో పంటపొలాలపై సోమవారం తెల్లవారుజామున కనిపించిన పొగమంచు దృశ్యాలివి.. - మండపేట

'నీళ్లా'కాశంలో..



సీప్లేన్ (ఫైల్‌ఫొటో)

- త్వరలో సీప్లేన్‌లో రయ్.. రయ్
- వాటర్ ఏరో డ్రోమ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- సముద్ర, నది, కాలువలకు అనుసంధానంగా రవాణా
- కాకినాడ - కోనసీమ ప్రాంతాల మధ్య రాకపోకలు
- ప్రభుత్వానికి రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ప్రతిపాదన



కాకినాడ బీచ్‌లో సందడి



బీచ్‌లో ప్యారాచూట్‌తో విన్యాసాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో సీప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే విజయవాడ -శ్రీశైలం మధ్య ఈ సర్వీసులు ప్రారంభంకాగా.. మరికొన్ని రోజుల్లో కాకినాడ-కోనసీమ జిల్లాల్లోనూ ఈ తరహా సీ ప్లేన్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు తీసుకొస్తున్నారు. దీనిద్వారా నీటిలోనే ప్రయాణం సాగనుంది. తక్కువ సమయంలోనే నిర్ణీత గమ్యానికి చేరుకోవచ్చు. నాలుగేళ్ల కిందట గుజరాత్‌లో ఈ సీప్లేన్ సర్వీసులను ప్రారంభించారు. అలాగే ఆమధ్య విజయవాడ కృష్ణా నది నుంచి శ్రీశైలం వరకు కూడా సీప్లేన్ నడిపారు. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను కలిపేలా రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించింది. అరకు నుంచి తిరుపతి వరకు ప్రతిపాదించిన 8 ప్రాంతాల మధ్య సీప్లేన్‌లు నడిపేలా రూట్లను ప్రతిపాదించింది. డీపీఆర్‌లు తయారుచేసి కేంద్ర విమానయానశాఖకు పంపనున్నారు. వాటిని పరిశీలించి, ఆమోదించిన లోకేషన్లలో వాటర్ డ్రోమ్‌లను కేంద్రం అభివృద్ధి చేయనుంది. ఈనేపథ్యంలో సీప్లేన్ నడిపేందుకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. ముఖ్యంగా సముద్ర, నదీతీర ప్రాంతాలతోపాటు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను ఎంచుకున్నారు. అరకు నుంచి తిరుపతి వరకు ఈ ప్లేన్‌లు తిరిగేలా రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధంచేశారు. అరకు-లంబసింగి, లంబసింగి-రుషికొండ, రుషికొండ-కాకినాడ, కాకినాడ-కోనసీమ, కోనసీమ-విజయవాడ, విజయవాడ-శ్రీశైలం, శ్రీశైలం-తిరుపతి మధ్య సీప్లేన్‌ను నడిపే ఆలోచనలో ఉన్నారు. ఇక మన ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలోని కాకినాడ సాగరతీరం నుంచి.. కోనసీమలో గోదావరి బ్యాక్ వాటర్ నిల్వ చేసే చోట ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ తీరం.. టూరిజం హబ్..

ఇప్పటికే కాకినాడ సాగరతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే పనులు పెద్దఎత్తున సాగుతున్నాయి. మరోవైపు పర్యాటకుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు నేపథ్యంలో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారు. వీరికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. సెలవుల్లోను, వారాంతాల్లోను పేరాచ్యూట్ వంటివి ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఎమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులకు పూర్తిస్థాయి వినోదాన్నిచ్చే అనేక పనులు అక్కడ జరుగుతున్నాయి. సమీపంలోనే కొత్తగా రిసార్ట్స్ కూడా ఏర్పాటవుతున్నాయి. మరో ఏడాది దాటితే మొత్తం కాకినాడ సాగరతీరం పూర్తిగా టూరిస్టుల హబ్‌గా మారనుంది. ఇక పచ్చని సీమగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలోని తీర ప్రాంతాలకు కూడా ఇప్పటికే పర్యాటకుల తాకిడి అధికంగా కనిపిస్తోంది. గోదావరి తీరాన ఆధ్యాత్మికంగాను ఆ ప్రాంతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో కాకినాడ సాగరతీరం నుంచి కోనసీమకు సీప్లేన్ అందుబాటులోకి వస్తే.. రెండు జిల్లాల వాసులకు మధ్య దూరం ఇంకాస్త దగ్గర కానుంది.

కాకినాడ నుంచి రుషికొండ బీచ్‌కు..

మరోవైపు కాకినాడ సాగర తీరం నుంచి విశాఖ సమీపంలోని రుషికొండ బీచ్‌కు కూడా సీప్లేన్ అందుబాటులోకి రానుంది. అక్కడ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. సముద్ర తీర ప్రాంతం, నది, కాలువలకు అనుసంధానంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు కన్సల్టెన్సీల కోసం రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మార్చి నెలలో టెండర్లు పిలిచింది. వాటిని పరిశీలన కోసం పంపారు. మొదటి దశలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో కాకినాడ, కోనసీమ ఉండడంతో మరికొన్ని నెలల్లోనే సీ ప్లేన్‌లు అందుబాటులోకి రానున్నాయి.

నర్సుల సేవలు..

అనన్యసామాన్యం

- కొవిడ్ సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశారు: డిప్యూటీ సీఎం పవన్



పిఠాపురం నియోజకవర్గంలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ఉత్తమ సేవలందించిన పిఠాపురం స్టాఫ్ నర్సు చిన్నారిని సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత చేకూరేలా నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, వారి సేవల ద్వారా వృత్తికే గౌరవాన్ని తీసుకువస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ కొనియాడారు. నిస్వార్థంగా వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులతో సమావేశమయ్యారు. ఉత్తమ సేవలు అందిస్తున్న 8మంది స్టాఫ్‌నర్సులను సత్కరించారు. నర్సుల చేతిస్పర్శ కూడా రోగుల్లో మానసిక స్థైర్యాన్ని, సాంత్వనను కలగచేస్తుందని తెలిపారు. విధినిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరు మరిచిపోలేరని చెప్పారు. మీరు పడే కష్టం, శ్రమ తనకు తెలుసునని తెలిపారు. కొవిడ్‌సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నర్సులు విధులు నిర్వహించిన విషయం మరువలేమని చెప్పారు. ఇటీవల సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురైనప్పుడు తాను ఆస్పత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరొకసారి మీ కష్టం గుర్తుకు వచ్చిందని వివరించారు. అందుకే నర్సులను స్వయంగా కలిసి మీరు అందించే సేవలు నిరుపమానమైనవని చెప్పి కృతజ్ఞతలు తెలపాలని భావించానని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మిమ్మల్ని కలిసే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. వారు తెలిపిన సమస్యలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఉత్తమ స్టాఫ్‌నర్సులు ఆర్.చిన్నారి, జి.సత్యవతి, బి.జీవిత, టి.సూర్యామణి, జె.భాగ్యరేఖ, పి.సూర్యకుమారి, ఎం.బుజ్జమ్మ, వి.విమలకుమారిలను పవన్ సత్కరించి పురస్కారాలు అందజేశారు.

మోతుగూడెంలో అతిథిగృహాలు, రిసార్ట్స్ తనిఖీ



మోతుగూడెం రిసార్ట్స్‌లో పర్యాటకుల వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

మోతుగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిసార్ట్‌ల యజమానులకు పలు సూచనలు ఇచ్చారు. మద్యం, గంజాయి సేవించడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలని యజమానులకు తెలియజేశారు. అనంతరం అతిథిగృహాలకు కస్టమర్లు వచ్చినప్పుడు ప్రతి వ్యక్తి పేరు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, నమోదు చేసిన తర్వాత గదులు కేటాయించాలని రిసెప్షన్ బుక్‌లో కచ్చితంగా వారి వివరాలు నమోదు చేయాలని అతిథిగృహ యజమానులకు తెలిపారు. అనంతరం కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా అతిథిగృహాలకు వస్తే వెంటనే పోలీసులకు 94409 00757 నెంబరులో సమాచారం ఇవ్వాలని సూచించారు.



సూర్యారావుపేట సముద్ర తీరంలో భావనారాయణ స్వామికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

వైభవంగా భావనారాయణస్వామికి చక్రస్నానం



సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం వద్ద స్వామివారికి పండితులు ప్రత్యేక పూజలు జరిపి పుష్పక వాహనంపై వేలాది మంది భక్తుల ఊరేగింపు నడుమ సూర్యారావుపేట సముద్రతీరానికి తోడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా తయారు చేయించిన వేదికపై చక్రపెరుమాళ్లకు అభిషేకం చేసిన తర్వాత సముద్రనీటితో చక్ర తీర్థ ప్రోక్షణ చేయించారు. సాయంత్రం ఆళ్వార్లు స్వామివారు చినపుష్పక వాహనం (శేష వాహనం)పై వేంచేయగా గ్రామోత్సవం, చోరోత్సవం జరిపారు. సహాయ కమిషనరు, ఈవో ఎం.లక్ష్మీనారాయణ, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



30 రకాల విత్తనాలతో పెరుగుతున్న మొక్కలు


- 30 రకాల విత్తనాలతో పోషకాల తయారీ
- సహజ పద్ధతుల్లో భూమి సారవంతానికి కృషి
- ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- పీఎండీఎస్‌ను ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ

పొలంలోనే ఎరువుల తయారీ

నాట్లు వేశాక ఎరువులను వాడటానికి బదులు ముందుగానే నేలలో పంటకు అవసరమైన సహజ పోషకాలను నిల్వ చేస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతోనే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రభుత్వం పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్) విధానాన్ని అమలు చేస్తోంది.

ఉప్పలగుప్తం, మే 12 (ఆంధ్రజ్యోతి): నాట్లు వేసిన తర్వాత రసాయనిక ఎరువులు వాడనవసరం లేదు. ప్రతి పంటకు ముందుగానే నేలలో ఎరువులు తయారు చేసుకోవచ్చు. కేవలం 30 రకాల విత్తనాలు పొలంలో చల్లుకుని పైరుకు కావలసిన పోషకాలను సహజ పద్ధతిలో తయారు చేసుకోవచ్చు. ఒకప్పుడు పశువుల పెంట, ఇతర సహజ సిద్ధ ఎరువుల వాడకంతో రైతులు భూసారాన్నిపెంచుకునేవారు. ఎకరా దిగుబడులు తక్కువే అయినా నాణ్యమైన పంట చేతికొచ్చేది. అందుకే తాము పండించిన ధాన్యాన్నే మరపట్టించి, బియ్యాన్ని నిల్వ చేసుకుని తినేవారు. తొలకరి వానలకు మట్టి కమ్మని వాసనతో గుబాళించేది. అనంతర కాలంలో ఎకరా దిగుబడులు గణనీయంగా పెరగాలన్న లక్ష్యాలు రైతులను రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకానికి పురిగొల్పాయి. ఇదే అదనుగా కార్పొరేట్ కంపెనీలు వివిధ రకాల రసాయనాల ఎరువులతో రైతులను ఆదాయ వనరుల పెంపు ఆలోచన వైపు మళ్లించాయి. ఫలితంగా రసాయనిక ఎరువులు వినియోగించనిదే పంట పండని పరిస్థితి ఏర్పడింది. రసాయనిక ఎరువుల వాడకంతో దిగుబడులు పెరిగిన నిష్పత్తిలోనే పైరుకు తెగుళ్ల బెడద ఏర్పడింది. పంట నాణ్యత తగ్గింది. తాను పండించిన గింజలను తానే తినలేని పరిస్థితిలో అన్నదాత అయోమయంలోపడ్డాడు. పొలాల్లో మట్టి కాలుష్యంతో విషాల్ని వెదజల్లుతోంది. అన్నదాత ఆలోచనలో పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చాలా కాలంగా కొందరు రైతులు తమకున్న పొలంలోని కొంత విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులతో ప్రకృతి సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణకు సహజ పద్ధతుల్లోనే నివారణ చర్యలు చేపడుతున్నారు. ఆ పంటనే ఏడాది పాటు తింటున్నారు.

భూసార పరిరక్షణకు అవసరమైన సహజ పోషకాలు,సూక్ష్మ పోషకాలు ఈ 30 రకాల పైరు నుంచి లభిస్తాయి. నత్రజని భూమిలో కావలసినంత నిల్వ ఉంటుంది. ఆయా విత్తన జాతుల నుంచి జింకు, లవణాలు, వివిధ పోషకాలు నేలలోనే పేరుకుని నేల దుక్కి అనంతరం పైరుకు అందుతాయి. భూమిలో వానపాముల ఉత్పత్తి పెరిగి నేల గుల్లబారుతుంది. నేలకు నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. పశువులకు పచ్చిగడ్డి మేత దొరుకుతుంది. పైరుకు రసాయనిక ఎరువుల ఆవశ్యకత ఉండదు. ప్రకృతి విధానంలో పోషకాలు అందడంతో పైరుకు చీడపీడల బెడద ఉండదు. పంటలో నాణ్యత ఉంటుంది. ఫలితంగా మార్కెట్లో ప్రకృతిసాగు దిగుబడులకు మంచి గిరాకీ ఉంటుంది. ఇప్పటికే సేంద్రియ ఎరువులు వాడి, ప్రకృతి సాగు చేస్తున్న రైతుల ఉత్పత్తులకు ఎంత గిరాకీ ఉందో అందరికీ తెలిసిందే. ఎకరా పెట్టుబడులు తగ్గడంతో దిగుబడులు తగ్గినా మార్కెట్ డిమాండ్‌తో ఎకరాకు వచ్చే ఆదాయం సంతృప్తికరంగానే ఉంటుందన్నది రైతుల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి.



ప్రకృతి సాగు పద్ధతిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను



గొల్లవిల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (పాత చిత్రం)

5 రకాల పప్పు విత్తన జాతులు, 6 రకాల చిరుధాన్యాలు, 4 రకాల పచ్చిరొట్ట విత్తనాలు, రెండు రకాల సుగంధ ద్రవ్యాలు, 3 రకాల ఆకుకూర విత్తనాలు, 8 రకాల కాయగూర విత్తనాలు, రెండు రకాల నూనె గింజల విత్తనాలు... మొత్తం 30 రకాల విత్తనాలను దాళ్వా కోతల సమయంలో పొలంలో చల్లుతారు. లేదా మూడో పంటగా చల్లి సాగు చేస్తారు.



రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం

ఎస్ఎం షంషీ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు

ప్రకృతి సాగుపై వ్యవసాయ శాఖ రైతులకు గ్రామగ్రామనా అవగాహన కల్పిస్తోంది. ఇటీవల కోనసీమవ్యాప్తంగా రైతులకు పీఎండీఎస్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. 30 రకాల విత్తనాల సంచులను రైతులకు అందించారు. ప్రస్తుతం పలువురు రైతులు కోతల సమయంలో ఈ విత్తనాలను చల్లుతున్నారు. ఈ విధానంతో పొలాలకు సారం చేకూరడంతో పాటు సాగుకు ముందే కొంత ఆదాయాన్ని సమీకరించుకోవచ్చు. ఆకు కూరలు, కాయగూరలు, అపరాలతో తదుపరి సాగుకు ముందే రైతుకు ఆదాయం లభిస్తుంది. ఈ 30 రకాల వేర్లను భూమిలోనే దుక్కి చేయడంతో అవసరమైన లవణాలు, నత్రజని, ఇతర పోషకాలు పైరుకు పుష్కలంగా లభిస్తాయి. ప్రకృతి సాగు చేస్తున్న రైతులతో పాటు గ్రామంలో మరికొందరు రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎండీఎస్ అమలు చేస్తున్నాం.

వేడుకగా సత్యదేవుడి చక్రస్నానం



పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్విక్‌లు, ఈవో

నేడు శ్రీపుష్పయాగం

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం పంపాసరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను... పెళ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పం డితుల వేదమంత్రోచ్చరణల నడుమ కొండపై నుంచి ఘాట్ రోడ్డు గుండా పంపాతీరం వద్ద నున్న ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం పంపాసరోవరంలో స్వామి, అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శనచక్రంలతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదికవద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు చైర్మన్ ఐవీ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4గంటలకు అనివేటి మండపం లో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉ ల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకుసాగారు. అర్చకస్వాములు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యంచేశారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

సత్యదేవుడికి శ్రీ విశ్వావసు నామసంవత్సర దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రికి జరి గే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 8 గంటలకు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో నవదంపతులను అర్చించి విశేషపదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీతాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.





నృత్యం చేస్తున్న అర్చకస్వాములు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి మాండవ కిరణ్మయికి స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఏపీ హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి సోమవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం కల్పించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం హైకోర్టు జడ్జి మాండవ కిరణ్మయి దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఏసీ సత్యనారాయణ అందించారు.

ద్రాక్షారామలో సీఎంవో కార్యదర్శి పూజలు



పూజలు చేస్తున్న మిశ్రా దంపతులు

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం సీఎంవో కార్యదర్శి కార్తికేయ మిశ్రా సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మిశ్రా దంపతులు భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు. మిశ్రా వెంట ఆర్డీవో దేవరకొండ అఖిల, తహశీల్దార్ మృత్యుంజయరావు, ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్నవరంలో యనమల పూజలు

అన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు ఉన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం యనమల రామకృష్ణుడు

మంచినీటి చెరువులో మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

రంగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలోని మంచి నీటి చెరువులో సోమవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఎస్ శివప్రసాద్ తెలిపారు. సుమారు 25-30 ఏళ్ల ఉండే వ్యక్తి మృతదేహం నీటిలో కనిపించగా స్థానిక వీఆర్వోకు చుట్టు పక్కలవారు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వివరాలు తెలిసినవారు అనపర్తి సీఐ 9440796538, రంగంపేట ఎస్ఐ 9440904854లో తెలియజేయాలని కోరారు.

ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి బదిలీ

అంబాజీపేట, మే 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు బదిలీ అయ్యారు. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్టుగా బదిలీపై వెళ్తున్నారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో అధిపతిగా ఆయన ఎన్నో ఏళ్లు సేవలందించారు.

కౌడా చైర్మన్ పదవికి తుమ్మల రాజీనామా

కార్పొరేషన్(కాకినాడ), మే 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ తుమ్మల బాబును డీసీసీబీ చైర్మన్ పదవి వరించడంతో ఒకే వ్యక్తి రెండు నామినేటెడ్ పదవుల్లో ఉండకూడదన్న నిబంధన ఉంది. దీంతో తాను కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తుమ్మల వెల్లడించారు. దీంతో ఆ చైర్మన్ కుర్చీ ఖాళీ అవ్వడంతో కొంతమంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు.

అడ్డతీగలలో భారీ వర్షం

అడ్డతీగల(వై.రామవరం), మే 12(ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో మధ్యాహ్నం 3గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ లేక రంపచోడవరం నుంచి అడ్డతీగల వరకు వచ్చే లైన్లలో ఇబ్బందులేర్పడి రాత్రంతా అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో అంధకారం అలుముకుంది.



అడ్డతీగలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు

మాతృత్వానికే మాయని మచ్చ



పిఠాపురంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

- రెండో పెళ్లికి అడ్డువస్తుందనే చిన్నారిని పీక నులిమి చంపేసి నూతిలో పడేశారు
- అమ్మ, అమ్మమ్మ కర్కశత్వం
- హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లికి అడ్డుగా ఉందనే ఉద్దేశ్యంతో కర్కశత్వం ప్రదర్శించి కన్నపేగునే చిదిమేసింది ఆ కన్న (కసాయి) తల్లి. అందుకు పూర్తిగా సహకరించింది అమ్మమ్మ. మాతృత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ సంఘటనలో ఐదు నెలల చిన్నారిని అత్యంత పాశవికంగా పీక నులిమి చంపివేసి పక్కనే ఉన్న నూతిలో పడవేసి, క్షుద్రపూజలు జరిగినట్టు చూపించి హత్యను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగు చూడడంతో చిన్నారిని హత్య చేసిన అమ్మ, అమ్మమ్మలను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన ఐదు నెలల చిన్నారి యశ్వితను ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చంపి నూతిలో పడవేశారని నరసింగపురం గ్రామానికి చెందిన పెదపాటి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై హత్య కేసు నమోదు చేసి ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక పరమైన అంశాలను ఆధారంగా చేసుకుని విచారణ చేపట్టారు. తల్లి, అమ్మమ్మ ఈ హత్యకు చేసినట్టు నిర్ధారణకు వచ్చారు. చనిపోయిన యశ్విత తల్లి పసుపులేటి శైలజ, పెదపాటి సతీష్ ప్రేమించి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్నారు. వీరికి ఐదు నెలల క్రితం పాప (యశ్విత) పుట్టింది. శైలజ వివాహం జరిగిన నాటి నుంచి భర్త తనను అత్తవారింటికి తీసుకువెళ్లకపోవడం, యశ్విత పుట్టినప్పుడు భర్త కుటుంబసభ్యులు, బంధువులు రాకపోవడం, భర్త ముందులా సఖ్యతతో లేకపోవడం శైలజ కొంతకాలంగా ఇబ్బందిగా ఉంది. అదే సమయంలో ముందు నుంచీ అనుకున్న మేనత్త కొడుకుతో కాకుండా ప్రేమించి వివాహం చేసుకోవడం, సతీష్‌కు పుట్టిన యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చని అమ్మమ్మ పసుపులేటి అన్నవరం భావించింది. అమ్మ శైలజ, అమ్మమ్మ అన్నవరం కలిసి పథకం ప్రకారం ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి చిన్నారి యశ్విత పీక నొక్కి చంపేసి వాళ్ల ఇంటి వెనుక ఉన్న అద్దాల కుమారి ఇంటి ఆవరణలో గల బావిలో పడేశారు. అనంతరం చేసిన హత్యను కప్పి పుచ్చుకునేందుకు పాపను ఎవరో మాంత్రికుడు చేతబడి చేసి చంపి ఉంటారని నమ్మించేందుకు ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వేసి క్షుద్రపూజలు జరిగినట్టు చూపించారు. అయితే అక్కడ వేసిన పసుపు, కుంకుమ ఇంటిలో నుంచి తెచ్చినట్టు ఉండటం, బావి సమీపంలో అమ్మమ్మ సెల్ పడిపోవడం తదితర అంశాల ఆధారంగా కేసు దర్యాప్తు సాగించి ఇద్దరినీ అరెస్టు చేశారు.

లోతుగా విచారణ

చిన్నారి హత్య కేసులో మరికొంత మంది పాత్ర ఉంటుందనే భావనలో పోలీసులు ఉన్నా రు. దీంతో మరింత లోతుగా విచారణ సాగించాలని నిర్ణయించారు. కోర్టు అనుమతితో అమ్మ, అమ్మమ్మలను అదుపులోకి తీసుకోవాలని భావిస్తున్నారు. భర్త, మేనమామ, తాతయ్య, ఇతర కుటుంబసభ్యుల పాత్రపై విచారణ జరపనున్నారు. అదే విధంగా శైలజ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని వాట్సాప్ సంభాషణలు, ఫోన్ కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు.

అందరికి న్యాయం చెప్పే...

హత్య కేసులో కీలకంగా ఉన్న చిన్నారి యశ్విత అమ్మమ్మ అన్నవరం వారి కులపెద్దల్లో ఒకరిగా ఉంది. పలు విషయాల్లో న్యాయం చెప్తూ ఉండడంతో పాటు గొడవలు, వివాదాలు సర్దుబాటు చేస్తుంది. అందరికీ న్యాయం చెప్పే ఈమె మాత్రం కూతురితో కలిసి ముక్కుపచ్చలారని ఐదు నెలల ఆడబిడ్డను పీక నులిమి హత్య చేయడం విస్మయాన్ని కలిగించింది. అమ్మ, అమ్మమ్మలు ఇంత కర్కశత్వంగా ఎలా వ్యవహరించగలిగారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణలో మరిన్ని విషయాలు వెలుగుచేసే అవకాశాలున్నాయనిభావిస్తున్నారు.

అత్తింటికి పయనమై.. అంతలోనే కన్నుమూసి

బస్సు ఢీకొనడంతో గాయాలపాలై మృతి

ద్రాక్షారామ, మే 12 (ఆంధ్రజ్యోతి): అత్తవారింటికి వెళ్తూ యువకుడు మృతిచెందిన సంఘటన కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ ఏనుగుబాయి తూము వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెందిన పిల్లి గోపాలకృష్ణ (27) గొల్లపాలెంలో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి గత నెల 22న కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. సోమవారం ఉదయం అత్తింటికి వెళ్తుండగా ద్రాక్షారామ- యానాం రోడ్డులో యానాం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నగా ఢీకొనడంతో గాయాలపాలై రోడ్డుపై పడ్డాడు. గోపాలకృష్ణను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న గోపాలకృష్ణ తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. వివాహం జరిగిన 20 రోజులకే మృతిచెందడంతో కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.



గోపాలకృష్ణ (ఫైల్)

పెళ్లికి వెళ్తే ఇల్లు గుల్ల

ఇంటి తాళాలు బద్దలుకొట్టి చోరీ

రూ.9.80 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు మాయం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు తెరచి రూ.8 లక్షల విలువైన బంగారు వస్తువులు, నగదు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 11న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట పెళ్లికి పందలపర్రు వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామాన్లన్నీ చిందరవందరగా పడవేసి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.9.80 లక్షల విలువైన 8 కాసుల బంగారు వస్తువులు, 250 గ్రాముల వెండి వస్తువులు, రూ.8లక్షల నగదు దొంగిలించుకుపోయారని పేర్కొన్నాడు. సమాచారం తెలిసిన వెంటనే ఇంచార్జి డీఎస్పీ కె.సత్యనారాయణ, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రైం సీఐ శ్రీధర్, క్లూస్ టీము, క్రైం టీములను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. నాగిరెడ్డి సత్తిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామినాయుడు

మోతుగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంపెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వాసుదేవరావు కడప ఆర్టీపీపీకి బదిలీ అయ్యారు. వాసుదేవరావు నుంచి స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం (టీఎన్‌వీకేఎస్) యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జాజుల రత్నాకర్ మూర్తి, లక్ష్మణ్‌కిరణ్, జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి కేసులో రూ.5లక్షల పరిహారం

జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో ఏపీ ప్రభుత్వం జీవో జారీ

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో నాలుగేళ్ల క్రితం మృతి చెందిన ఖైదీ కేసులో అతడి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేయగా.. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుత ఏఎస్ఆర్ పాడేరు జిల్లాకు చెందిన కళ్యాణం వెంకన్న(32) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండు ఖైదీగా వచ్చాడు. 2021 మే 4న అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పలు విచారణలు పరిశీలించిన ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల 2024 మార్చి 21న ఆదేశాలు జారీ చేసింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటూ వెంకన్న కుటుంబీకులకు రూ.5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐడియా సో (ఫ్రె) ఫిష్!



ఉపాయం ఉండాలే గానీ ఉపయోగపడని దంటూ ఏదీ ఉండదని పెద్దలు చెబుతుంటారు. ఈ ఫొటోను చూస్తే ఆ మాటలను నిజమే అనిపించక మానదు. పాడైపోయిన ఫ్రిజ్‌లు పాడైతే కొన్నాళ్లు మూలన ఉంచి తర్వాత పాత సామాన్ల వాడికి అమ్మేయడం, చేస్తుంటారు. అయితే అలాంటి ఫ్రిజ్‌లను కూడా అక్వేరియంగా ఉపయోగించుకుంటే ఇలా ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ మార్కెట్‌లో చేపల వ్యాపారులు పాడైపోయిన ఫ్రిజ్‌లలో అరలు, డోరును తీసేసి ఇదిగో ఇలా పడుకోబెట్టి నీళ్లు పోసి చేపలను వేస్తున్నారు. వాటికి ఆక్సిజన్ అందడానికి యాభై రూపాయలతో చిన్న యంత్రాన్ని పెడుతున్నారు. దీంతో చేపలు తాజాదనంతో పాటు ఎక్కువసేపు బతికి ఉంటున్నాయి. వీటిని చూసిన జనం. ఈ ఫ్రెస్ ఐడియా బాగుందే అనుకుంటున్నారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

మండేన్

ప్రచండభానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. సోమవారం రాజమహేంద్రవరంలో అత్యధికంగా 43 డిగ్రీలు, కాకినాడలో 38 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.





రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా పుష్కర్‌ఘాట్ రోడ్డు





రాజమహేంద్రిలో ఎండ దెబ్బ తగలకుండా ఏర్పాట్లు



కాకినాడలో ఎండలో ప్రజల పాట్లు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

శ్యామలాంబ అమ్మవారికి ఎమ్మెల్యే రాజప్ప పూజలు

సామర్లకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచాల గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ముమ్మిడి సూరిబాబు, తిక్కిరెడ్డి వాసు, పోతుల శ్రీను వున్నారు.


డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

ఉద్యోగోన్నతి కల్పించాలని ఏఎన్‌ఎంల ధర్నా

జీజీహెచ్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.179 ద్వారా గ్రామ, వార్డు సచివాలయ గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగాల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అస్కార రావు, శ్రీకాంత్‌రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయినా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎందుకు తాత్సారం జరుగుతోందని ప్రశ్నించారు. ఇందుకు కొంతమంది కార్యాలయ సిబ్బంది అవగాహనారాహిత్యం, డీఎంహెచ్‌వో నిర్లక్ష్యమే కారణమన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అక్కడకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. మంగళవారం మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని, ఈ నెల 22న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించి ధర్నా విరమించారు.


మరిడమ్మ ఆలయ ఆవరణలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మరిడమ్మ అమ్మవారికి చండీ హోమం

పెద్దాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేద పండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మరిడమ్మ అమ్మవారిని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

డాక్టర్ సూర్యారావుకు 'అక్షర తేజం' పురస్కారం

కాకినాడ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): కళలు, సాహిత్య రంగంలో అందించిన సేవలకు కాకినాడకు చెందిన కవి, నటుడు డాక్టర్ తురగా సూర్యారావు 'అక్షర తేజం' జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఏలూరులో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో ఆయనకు అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీభూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారధి పురస్కారం అందజేసి శాలువాతో సత్కరించారు. పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగి అయిన సూర్యారావును సోమవారం పోస్టల్ ఎంప్లాయిస్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందించారు.


పురస్కారం అందుకుంటున్న సూర్యారావు

కలెక్టర్ చొరవతో రూ.15వేల దివ్యాంగ పింఛను

కలెక్టరేట్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో శాశ్వత వైకల్యంతో బాధపడుతున్న కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన వీతల వీర వెంకట సత్యనారాయణకు రూ.15వేల దివ్యాంగ పింఛను పొందేందుకు వీలు కలిగింది. సత్యనారాయణ 11ఏళ్ల క్రితం విద్యుత్ లైన్‌మెన్‌కు సహాయకుడిగా పనిచేస్తూ కరెంటు స్తంభం పైనుంచి పడిపోవడంతో వెన్నుముక దెబ్బతిని వైకల్యం సంభవించింది. శారీరక వైకల్యం 41శాతంగా నమోదు కావడంతో ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.6 వేలు పింఛను మాత్రమే మంజూరైంది. గత నెల 21న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి సత్యనారాయణను స్ట్రెచర్‌పై తీసుకువచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. శాశ్వత వైకల్యం ధ్రువీకరణ కావడంతో ప్రభుత్వం ఈ నెల 7న ప్రారంభించిన కొత్త పింఛన్ల జారీ కార్యక్రమం ద్వారా సత్యనారాయణకు రూ.15వేలు పింఛను పొందేందుకు మార్గం సుగమమైంది. దీంతో అతడి కుటుంబ సభ్యులు, సింహాద్రిపురం ప్రజలు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ స్థల పరిశీలన

సామర్లకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంపేట శివారు ఇస్కాన్ కేంద్రం సమీపాన రూ.3.04 కోట్ల వ్యయంతో 5ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరిశీలించారు. ఈఈ ఏపీఎస్పీడీసీఎల్ ప్రభాకర్ మాట్లాడుతూ జూలై 31 నాటికి పనులు పూర్తవుతాయని చెప్పారు. నిర్మాణానికి మంత్రి రవికుమార్ మంగళవారం శంకుస్థాపన చేస్తారన్నారు. ఎస్ఈ జి.ప్రసాద్, ఏడీఈ కిరణ్, టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, వీరంరెడ్డి పెదబాబు పాల్గొన్నారు. సామర్లకోట బలుసులపేట వద్ద ఆధునీకరించిన తహసీల్దారు కార్యాలయాన్ని, ఐసీడీఎస్ పెద్దాపురం ప్రాజెక్టు కార్యాలయాన్ని చినరాజప్ప పరిశీలించారు. మంగళవారం వీటిని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ప్రారంభిస్తారన్నారు.


స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

నీలపల్లిలో బుద్ధ జయంతి

తాళ్లరేవు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని నీలపల్లి పంచాయతీ సిద్ధార్థ నగర్‌లోని బుద్ధ విగ్రహ ప్రాంగణంలో తాళ్లరేవు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుద్ధ జయంతి నిర్వహించారు. బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ జవహర్ పుష్పమాలలు వేశారు. 'బౌద్ధం-మంచి ప్రశ్నలు-మంచి జవాబులు' పుస్తకాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఎన్.పెద్దిరాజు, జక్కల ప్రసాద్‌బాబు, కాశి కరుణ, పినిపే నాగేంద్రరావు, కన్నీడి వెంటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంటా గోపి, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

మెరైన్ సీఐ 'పల్లె నిద్ర'

సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో పల్లె నిద్ర చేశారు. మత్స్యకార భరోసా పథకం కింద సుమారు 40 మందికి ప్రభుత్వ పరిహారం అందలేదని, స్థానిక ఫ్యాక్టరీల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. సముద్రంతో పాటు తీరంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. గ్రామ పెద్దలు ఎల్లబోయిన రమణ, గరికిన రమణ, దూడా వీరభద్రరావు, ఏఎస్ఐ మధు, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

'ఓటమిలోనూ గొప్ప అవకాశం దాగి ఉంది'

కార్పొరేషన్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటమిలోను, అది తీసుకువచ్చే నిరాశలోను గొప్ప అవకాశం దాగి ఉందని సత్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కాద వెంకటరమణ అన్నారు. సత్య స్కాన్స్, డయాగ్నోస్టిక్స్ సత్య చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని దంటు కళా క్షేత్రంలో పదో తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఓటమి అనే నివురులోపల విజయం అన్న నిప్పుకణిక దాగి ఉందనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకున్ననాడే కోరుకున్న విజయాలను చేరుకోవచ్చన్నారు. కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ సానుకూల దృక్పథం, నిబద్ధత ఉంటే విజయాలు వాటంతట అవే వస్తాయనడానికి తన జీవితమే ఒక ఉదాహరణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కమర్షియల్ టాక్స్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ జీవితంలో నిజమైన సంతోషం పొందడంలో మన ఆలోచనా విధానం చాలా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించి పదో తరగతిలో 540 మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్ష ఆధారంగా ప్రతిభ కనబరిచిన 70 మందికి రూ.2లక్షలు ఉపకార వేతనాలను ముఖ్య అతిథులు అందజేశారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ ఉప కులపతి డాక్టర్ వై.బాబ్జీ, డాక్టర్ ఆర్ఎస్‌బీ చక్రపాణి, డాక్టర్ రామ్‌స్వరూప్ జవహర్, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, పడాల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర్యప్రసాద్, అభ్యుదయ రచయితల సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు అందుకున్న పదో తరగతి విద్యార్థులు

నేడు జాబ్‌మేళా

సామర్లకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీ ఆవరణలో మంగళవారం సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కేంద్రంగా డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలతో 15 ట్రైనీ టెలికం ఇంజనీర్ పోస్టులకు, కాకినాడ, కోనసీమ జిల్లాలు కేంద్రంగా ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్హతలతో ఫీల్డ్ ఆఫీసర్లుగా 20 పోస్టులకు, కాకినాడ కేంద్రంగా బీకాం విద్యార్హతతో రెండు పోస్టులు, ఐటీఐ విద్యార్హతతో రెండు పోస్టులకు, ఇంటర్ విద్యార్హతతో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా ఐదు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9030924569, 8919868419 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దుర్గాడలో పౌర్ణమి పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి, విశాఖ నక్షత్రం, సోమవారం కలిసి రావడంతో దుర్గాడలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి విశేష పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. లలితాదేవికి అర్చకులు చెరుకూరి వీరబాబు,దత్తు పంచామృతాలతో అభిషేకం చేశారు.


కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీహెచ్‌వోల వినూత్న నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో) సోమవారం కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం జీతాలు ఇవ్వట్లేదంటూ భిక్షాటన చేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాల పెంపును వర్తింపజేయాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, నిర్దిష్ట జాబ్ చార్టర్ ఇవ్వాలన్నారు. ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. హేమంత్, రఘు, వరకాంత్, నానాజీ పాల్గొన్నారు.



కాకినాడలో అర్జీదారునితో మాట్లాడుతున్న కమిషనరు భావన, పిఠాపురంలో వినతులు స్వీకరిస్తున్న 'పాడా' పీడీ చైత్రవర్షిణి

పీజీఆర్ఎస్ వినతులకు గడువులోగా పరిష్కారం చూపాలి

కార్పొరేషన్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనరు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్‌కి మూడు, ఇంజనీరింగ్ విభాగానికి రెండు, పారిశుద్య నిర్వహణపై ఒక అర్జీ అందింది. పీజీఆర్ఎస్‌లో కమిషనరు భావన 16 అర్జీలు స్వీకరించారు. వినతులకు సంబంధిత సిబ్బంది నిర్దీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, మేనేజరు కె.సత్యనారాయణ, హెల్త్ ఆఫీసర్ డి.పృధ్వీచరణ్, ఎస్ఈ వెంకట్రావు, ఈఈ రాజు, టీపీఆర్వో శైలజ, సీఎంఎం వెంకట్రాజు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 అర్జీలు అందాయి. ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అర్జీదారులకు సంతృప్తి కలిగించే స్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఏపీడీ వసంతమాధవి, తహసీల్దార్లు గోపాలకృష్ణ, సత్యనారాయణ, కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

పిఠాపురంలో తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం బైపాస్‌లోని గోపాల్‌బాబా ఆశ్రమ ప్రాంగణంలో అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లపాక అన్నమాచార్యులు 617వ జయంతి నిర్వహించారు. అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ పాడిన కీర్తనలు నేటికీ సజీవంగా ఉన్నాయని పలువురు వక్తలు అన్నారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీ, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, తోట ఏడుకొండలు, మహాశక్తి పీఠం మాతాజీ లక్ష్మీప్రసన్న, చిత్రాడ వాస్తవ పీఠాధిపతి విశ్వానంద భారతి స్వామీజీ, అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా అధ్యక్షుడు సానా నూకరాజు, సమన్వయకర్త ఏకేబీ సునీత పాల్గొన్నారు. తిరుమలలోని అన్న మయ్య గృహం, హనుమంతుని విగ్రహాన్ని టీటీడీ కూల్చివేసిందని... వాటిని పునురుద్ధరించాలని అన్నమయ్య కళాక్షేత్రం, కాకినాడ జిల్లా భజన కళాకారుల సంఘం ప్రతినిధులు కౌడా చైర్మన్ తుమ్మల బాబుకు వినతిపత్రం అందజేశారు. తిరుమలలో మాదిరిగా అన్నవరం దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తనకు అవకాశం కల్పించాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలో వేంచేసియున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి నిర్వహించారు. ఆకొండి వెంకట్రావు, వింజమూరి గాయత్రి, పరకాల సుబ్బరాయశర్మ, వారి శిష్యులు సప్తగిరి రాగంలో ఆలపించిన కీర్తనలు ఆహుతులను మైమరిపించాయి. వయోలిన్‌పై పురాణం గణపతిరావు (రాజమహేంద్రవరం), మృదంగంపై గట్టి కృష్ణకాంత్ (దుబాయి) సహకారం అందించారు. బాదం సూర్యప్రకాశరావు దంపతులు, గట్టి శ్రీకృష్ణదేవరాయ, కొండేపూడి శంకరరావు, వెన్నపు చక్రధరరావు, కేవీఎస్ ప్రసాద్, తటవర్తి సుబ్బారావు, శ్రీపాద లక్ష్మణరావు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.


సామర్లకోటలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఈదురుగాలులతో వర్షం

సామర్లకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఉదయం నుంచీ అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోత వాతావరణంతో అల్లాడిన చిన్నారులు, వృద్ధులు చల్లదనంతో సేదతీరారు. అరబోసిన ధాన్యం రాశులను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడాల్సి వచ్చింది.

19న శ్యామ్‌బాబు సంస్మరణ సభ

సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మాదిగ సామాజికవర్గం అభ్యున్నతికి విశేష కృషి చేసిన కొండేపూడి శ్యామ్‌బాబు సంస్మరణ సభను ఈ నెల 19న కాకినాడలో నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ముమ్మడివరపు చినసుబ్బారావు తెలిపారు. ఇటీవల మృతి చెందిన శ్యామ్‌బాబు కుటుంబసభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. కొండేపూడి రాజాజీరాయ్, రాహుల్‌రాయ్, పలివెల నవీన్‌మాదిగ, డి.వెంకటరమణ, జిత్తుక బాబూరావు, పలివెల నాగరాజు, దేవారపు సురేష్ పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ధర్నా

కాకినాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం యూటీఎఫ్ కాకినాడ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు వీవీ రమణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో తిరోగమన విధానాలు అమల్లోకి వస్తున్నాయన్నారు. సమాంతర మీడియం కొనసాగించాలని, పాఠశాలలు, ఉపాధ్యాయులు తరచూ రేషనలైజేషన్ జరగడానికి ప్రధానమైన కారణం విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ చేయడమేనని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం. 117 రద్దు చేయాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో పి.రమేష్‌కు అందజేయగా వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. నాగేశ్వరరావు, సీతారామరాజు, గోవిందరాజు, నాగరాజు, సీతారామయ్య, గోపాలరావు, రాజబాబు, నాగమణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాపారులకు 'లీగల్ మెట్రాలజీ' అవగాహన సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల సందర్భంగా సోమవారం కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కిరాణా జనరల్ స్టోర్స్, చిరు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ కంట్రోలర్ ఎల్.జనార్దనరావు పలు అంశాలపై కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పూర్ణచంద్రరావు, సాయి, ఇతర వ్యాపారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ సలీం మాట్లాడుతూ వ్యాపారులు తూకం, ఎంఆర్పీ రేట్లు, ప్యాకింగ్ సరిగ్గా చూసుకోవాలన్నారు. వినియోగదారుల సమాఖ్య జాయింట్ సెక్రటరీ, డీసీపీసీ మెంబర్ కొమ్మూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సులు ఎంతో మందికి ఉపయోగపడుతున్నాయన్నారు.

తూరంగిలో నకిలీ ఇంటి పన్నులతో దోపిడీపై ఫిర్యాదు

కలెక్టరేట్/సర్పవరం జంక్షన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తూరంగి పంచాయతీలో నకిలీ ఇంటి పన్నులతో గుమస్తా, కార్యదర్శి దోపిడీకి పాల్పడుతున్నారని, విచారణ జరిపి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ పితాని రాము కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు.


నర్సులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

'నర్సుల సేవలు కీలకం'

జీజీహెచ్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నర్సుల సేవలు కీలకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మాతా, శిశు విభాగం వద్ద ఉన్న ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి ఆయన పుష్పమాల వేశారు. అనంతరం ఈఎన్‌టీ సెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ ఎన్.సంధ్యారాణిని సూపరింటెండెంట్ సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జయశ్రీ, నర్సింగ్ యూనియన్ ప్రెసిడెంట్ బూరిగ విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ బి.రాణి, సెక్రటరీ జి.ప్రమోద, ట్రెజరర్ కె.పరమేశ్వరి, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి జాతర

కొత్తపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ప్రజల ఆడపడుచు, గ్రామ దేవతగా విరాజిల్లుతున్న ముత్యాలమ్మ తల్లి జాతర సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారిని సిరిమాను (తాడిచెట్టు)ను రెండెడ్ల బండిపై పురవీధుల్లో ఊరేగించారు. సిరిమానుపై ప్రజలు పసుపు, కుంకుమలతో కలిపిన నీళ్లు పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సిరిమాను ఉత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

తాత్విక జ్ఞానంతో తృప్తి, శాంతి

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు వెచ్చించినా పొందలేని తృప్తి, శాంతిని తాత్విక జ్ఞానంతో పొందవచ్చని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. పట్టణ శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆయన భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా పేదలకు కుట్టుమిషన్లు, పక్షులకు ఆహారంగా పెట్టేందుకు భక్తులకు ధాన్యపు కుచ్చులు అందజేశారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌వీటీ ప్రసాదవర్మ, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి: వర్మ

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్డుల్లో మార్పులు, చేర్పులతో పాటు చిరునామా మార్చుకోవచ్చన్నారు. కొత్తగా రైస్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి మ్యారేజీ సర్టిఫికెట్ తప్పనిసరనే నిబంధన ఉందని, దీనిపై పలువురు వినతులు అందజేశారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడగా వివాహమైనట్టు వీఆర్వో సర్టిఫై చేస్తే సరిపోతుందని చెప్పారన్నారు.

టిడ్కో గృహాలు అప్పగించాలని లబ్ధిదారుల ఆందోళన

కార్పొరేషన్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను తమకు తక్షణం అప్పగించాలని కోరుతూ లబ్ధిదారులు సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పులు చేసి డబ్బులు చెల్లించిన తమకు ఇప్పటివరకు గృహాలు కేటాయించలేదని, మరోపక్క డబ్బులు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కమిషనరు సుధాకర్‌కు వినతిపత్రం అందించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ

జీజీహెచ్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కాకినాడ జీజీహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ సమావేశం జీజీహెచ్‌లో యూనియన్ అధ్యక్షుడు వై.శంకర్ అధ్యక్షతన జరిగింది. మెస్ యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు, సీఐటీయూ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప సమ్మెలో జీజీహెచ్ మెస్ కార్మికులు కూడా పాల్గొనాలని కోరారు. వీరబాబు, వై.శ్రీను, రాజశేఖర్, శ్రీను, కృష్ణ, దుర్గమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రణభేరికి తరలిన మాలలు

తాళ్లరేవు, మే 12 (ఆంధ్రజ్యోతి): కాకి నాడలో జరిగిన మాలల రణభేరికి మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లపై తరలివెళ్లారు. దళితసంఘం అధ్యక్షుడు కన్నీడి వెంకటరమణ, నేతలు జక్కల ప్రసాద్‌బాబు, కాశి లక్ష్మణస్వామి, మాసా శ్రీనివాసరావు, దడాల బుజ్జిబాబు, కుసుమ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సత్యనారాయణమూర్తి

కాకినాడ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): తుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా వైఎస్ఎన్ సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మే 12(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 30అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆయన ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, వివిధ శాఖల అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. రోడ్లకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని, వెలగపల్లి-గుంపెనపల్లి కాలువకు వంతెన నిర్మించాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, కొండపల్లి రిజర్వాయర్‌లో పూడిక తీత పనులు చేపట్టాలని, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం.రుక్మాండయ్య, షరీఫ్, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియల్, రవికుమార్, సుబ్బయ్య, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

అంకిత భావంతో నర్సుల సేవలు

చింతూరు, మే 12(ఆంధ్రజోతి): రోగులకు నర్సులు అంకిత భావంతో సేవలు అందిస్తున్నారని చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడారు. వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకమైందన్నారు. నాణ్యమైన వైద్యం అందించడంలో నర్సులదే ప్రధాన భూమిక అన్నారు. రోగులకు సేవలు అందించడాన్ని నర్సులు గర్వకారణంగా భావించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా నర్సుల సేవలను గుర్తిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికిషోర్ రెడ్డి, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ స్పందన, డా.భరద్వాజ్, డాక్టర్ సుధీర్, హెడ్‌నర్స్ కుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్న చింతూరు ఏరియా ఆసుపత్రి నర్సులు

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఐటీడీఏ పీవో సింహాచలం



ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, మే 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు ఈక బుల్లికొండలుదొర, మడకం ప్రసాద్‌దొర, కారం సీతారాయమ్మ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదే, రామచంద్రరావు, టీడీపీ నాయకులు కారం సురేష్ బాబు, వై.నిరంజనీదేవి, పి.సూర్యనారాయణ రాజు, మల్లిన రామకృష్ణ, నియోజకవర్గ జనసేన వీరమహిళ వండా వరలక్ష్మి పోతురాజు తదితరులు చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

వీఆర్‌పురం, మే 12(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం వడ్డిగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. వడ్డిగూడెంలోని శ్రీస్వామివారి ఆలయ ప్రాంగణంలో మేళతాళాలతో నరసింహస్వామి వారి కల్యాణం ప్రధానార్చకులు పురుషోత్తమాచారి కన్నుల పండుగలా జరిపించారు. అలాగే రాజుపేట గ్రామంలోని ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామస్తులు సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. విశ్వహిందూ ప్రచార ధర్మకర్త గోపాల కృష్ణనాయుడు, గ్రామపెద్దలు ముత్యాల రామారావు, బొర్ర దుర్గారావు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న ప్రధానార్చకులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఎటపాక, మే 12(ఆంధ్రజ్యోతి): కృష్ణవరం గ్రామంలో కూరం నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి దశ దిశ కార్యక్రమం కోసం స్థానిక యూత్ సభ్యులు రూ.16,500 ఆర్థిక సహాయంగా సోమవారం అందించారు. దీంతో ఆ నగదుతో నారాయణ దశ దిశ కార్యక్రమాలను బాధిత కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవరం సర్పంచ్ కుర్సం కృష్ణ, కాక రాజు, సున్నం శ్రీను, చిచ్చడి రామారావు,పద్దం వెంకటేశ్వర్లు, చిచ్చిడి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక హారతులు

రాజవొమ్మంగి, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశ్రీశ్రీ భూదేవి శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు బీవీఎస్ఎన్ గుప్త ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రవితేజశర్మ సమక్షంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం సామూహిక హారతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సామూహిక హారతులతో మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ఇది ఒక మంచి ప్రయత్నం అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అడ్డూరి వీరవెంకట సత్యనారాయణరాజు దంపతులు, ఆడపడుచులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు కంబాల ఆర్థిక సాయం

దేవీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట నుంచి గోపాలపురం వెళ్లే రహదారి ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉంటుంది. ఈరోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు మరమ్మతులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. సోమవారం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఆర్థిక సాయం చేసిన కంబాల శ్రీనివాసరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వాసుదేవరావుకు జెన్‌కో ఉద్యోగుల అభినందనలు

మోతుగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తోన్న వాసుదేవరావు కడప ఆర్టీపీపీకి బదిలీ అయ్యారు. సోమవారం ఆయనకు లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో అధికారులు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ అకౌంటు ఆఫీసర్లు వాసుదేవరావుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్స్, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడి మృతి



రాజవొమ్మంగి, మే 12(ఆంధ్రజ్యోతి): గడవకుర్తి పంచాయతీ గొబ్బిలమడుగు ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఈక గోపి వైద్యం పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన ఈక గోపి(44) గొబ్బిలమడుగు ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. గోపి అనారోగ్యానికి గురవ్వడంతో కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

ముగిసిన టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు

దేవీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): నెల రోజుల నుంచి మండలంలో గ్రామసభలు ఏర్పాటుచేసి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు పూర్తిచేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. 14పంచాయతీలకు గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, బూత్‌కన్వీనర్, కోకన్వీనర్లను నియమించి అధిష్టానానికి పంపించామన్నారు. కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు మాగాపు బాబూరావు, తైలం గంగాధర్‌రావు, ముంద్రు మధుసూదనరావు, కుంజం రాజామణి, గొళ్ల చంటిబాబు, ముచ్చు వీరవెంకటసత్యనారాయణ, కొండ్ల కొండారెడ్డి, జొన్నల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యనమల జన్మదిన వేడుకలు



తుని రూరల్: యనమలకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

తుని రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు జన్మదిన వేడుకలు సోమవారం తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు. యనమలకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. పలు గ్రామాల్లో అన్నదానాలు, వస్త్రదానాలు నిర్వహించారు. తుని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ భువన సుందరి చాంబర్లో కౌన్సిలర్లతో కలిసి యనమల జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

తొండంగి(ఆంధ్రజ్యోతి): యనమల పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వర్రావు ఆధ్వర్యంలో ఏవినగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యనమల రాజేష్‌తో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, గర్భిణులకు పండ్లు అందించారు. తొండంగి, రావికంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యనమల రాజేష్ గర్భిణులకు, రోగులకు రొట్టె, పండ్లు అందించారు. ఏవినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు రవికుమార్, భారతి తదితరులున్నారు.

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి యనమలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్ తేటగుంటలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కోటనందూరు బస్‌స్టేషన్ వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు నడుమ భారీ కేక్ కట్ చేశారు. ఆసుపత్రికిలో రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట భాస్కర సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, గోర్లి అచ్చియ్యనాయుడు, షేక్ నవాబ్‌జానీ, వెలగ వెంకటకృష్ణారావు, పోతల సూరిబాబు, అంకంరెడ్డి బుల్లిబాబు, పెనుమర్తి నాగేశ్వరావు, చింతకాయల రవికుమార్, యర్రా చిన సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, లగుడు సత్యనారాయణమూర్తి తదితరులున్నారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత ఇటంశెట్టి అశోక్ నివాసంలో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, కైశర్ల సత్యనారాయణ, పైల దివాణం, సుర్ల జేమీలు, యర్రా వరహాలదొర తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జ్ఞాపిక అందజేసి సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తేటగుంటలోని తుని ఎమ్మెల్యే యనమల దివ్య క్యాంపు కార్యాలయం వద్ద యనమల రామకృష్ణుడిని సత్యప్రభ, నియోజకవర్గ టీడీపీ నాయకులు విచ్చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వెన్న ఈశ్వరుడు, సీబీఎన్‌ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, ప్రత్తిపాడు, శంఖవరం మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, బద్ది రామారావు, లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్, ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, అంబటి రాంబాబు, సాధనాల లక్ష్మీబాబు పాల్గొన్నారు.



యనమలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సత్యప్రభ

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

ఏలేశ్వరం, మే 12 (ఆంధ్రజ్యోతి): నర్సుల సేవలు వెలకట్టలేనివని వక్తలు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని హెడ్ నర్సు ప్రమీళ ప్రేమ రత్నం నేతృత్వంలో కేక్ కట్ చేసి స్థానికులకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. కేళిం పద్మ, జానకి, శ్రీదేవి, సుమతి, రజిని, వరలక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో...

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): ఎంపీ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఇజ్జిన మల్లి ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవాన్ని గుర్రంపాలెంలో నిర్వహించారు. వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులిప్రసాద్ మాట్లాడుతూ నర్సులు కరోనా సమయంలో చేసిన సేవలను కొనియాడారు. గుర్రంపాలెం ఏఎన్ఎం శ్రావణ సంధ్యకు సన్మానం చేశారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఆశవర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను ఆపివేయాలని వినతి



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గిరిజనులు

రౌతులపూడి, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలంటూ మండల గిరిజన గ్రామాలైన పెద్దూరు, సార్లంక సత్యవరం, రాఘవపట్నం గిరిజనులు తహశీల్దార్ ఎన్వీ నరేష్, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శివరామకృష్ణయ్యకు ప్రజా ఫిర్యాదు వేదికలో వినతిపత్రం అందజేశారు. మైనింగ్ వల్ల మా గ్రామాల్లో రహదారులు నాశనమవుతున్నాయన్నారు. రహదారి పక్కన చెట్లు నరికి పర్యావరణానికి హానిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా బమిడికలొద్దు గ్రామంలో లాటరైట్‌ను రౌతులపూడి మండలం చల్లూరు వద్ద డపింగ్ చేసిన ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ మైనింగ్ నిలిపివేసి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, యాదల సత్యనారాయణ, జి.గంగరాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర

జగ్గంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజమండ్రి రోడ్డు గవర్నమెంట్ హాస్కూల్ సోమాలమ్మనగర్‌లో ఉన్న సోమాలమ్మ తల్లి అమ్మవారి 7వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు, విశిష్ట అలంకరణ, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత పౌర్ణమి మహా హోమం నిర్వహించారు. ఈనెల 16న ఉదయం 10 గంటల నుంచి మహా అన్నసమారాధన ఉంటుందని నాగేంద్ర చౌదరి తెలియజేశారు. కార్యక్రమంలో జీను మణి బాబు, జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైఆర్‌కె శ్రీనివాస్, బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, దాపర్తి సీతారామయ్య, జగ్గంపేట పంచాయతీ సెక్రటరీ శివ, భక్తులు పాల్గొన్నారు.

విజయరత్నకు కవిరత్న బిరుదు

కిర్లంపూడి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ తిరగటి విజయరత్న కవిరత్న బిరుదు అందుకున్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విజయరత్నకు కవిరత్న బిరుదును ముఖ్య అతిథులు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయులు లింగంశెట్టి కృష్ణ, స్టాఫ్ సెక్రటరీ బాలెం నూకరాజు,ఉపాధ్యాయ బృందం అభినందించారు.



కలెక్టర్ చొరవతో దివ్యాంగ పింఛను

కలెక్టరేట్ (కాకినాడ), మే 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో శాశ్వత వైకల్యంతో బాధపడుతున్న కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన పీతల వీర వెంకట సత్యనారాయణకు రూ.15వేల దివ్యాంగ పింఛను పొందేందుకు వీలు కలిగింది. సత్యనారాయణ 11ఏళ్ల క్రితం విద్యుత్ లైన్‌మెన్‌కు సహాయకుడిగా పనిచేస్తూ కరెంటు స్తంభం పైనుంచి పడిపోవడంతో వెన్నుముక దెబ్బతిని వైకల్యం సంభవించింది. శారీరక వైకల్యం 41శాతంగా నమోదు కావడంతో ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.6 వేలు పింఛను మాత్రమే మంజూరైంది. గత నెల 21న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి సత్యనారాయణను స్ట్రెచర్‌పై తీసుకువచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. శాశ్వత వైకల్యం ధ్రువీకరణ కావడంతో ప్రభుత్వం ఈ నెల 7న ప్రారంభించిన కొత్త పింఛన్ల జారీ కార్యక్రమం ద్వారా సత్యనారాయణకు రూ.15వేలు పింఛను పొందేందుకు మార్గం సుగమమైంది. దీంతో అతడి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రహదారిలో గుంతలు పూడ్చివేత

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కిర్లంపూడి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామం నుంచి వీరవరం వెళ్లే రహదారిలో రెండు పెద్ద గుంతలు ఏర్పడడంతో వీరవరం గ్రామస్తులు పురదాసు వెంకటేష్, పులి రంగా పలువురు నిరసన తెలిపారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో సోమవారం వార్త ప్రచురితమైంది. దీనికి ఆర్‌అండ్‌బి శాఖాధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఇక్కడ కల్వర్టు నిర్మించాల్సి ఉండగా తాత్కాలికంగా రెండు తూరలు దింపి చర్యలు తీసుకున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ రాఘవరావు తెలిపారు. ప్రధాన రహదారి పనులు చేపట్టే సమయంలో ఇక్కడ శాశ్వత పరిష్కారం దృష్ట్యా సిమెంట్ కల్వర్టు నిర్మిస్తామని వెల్లడించారు. సమస్యపై వెంటనే స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులకు గ్రామస్తులు వెంకటేష్, రంగా, పులి కపిల్, పులి వినయ్ కృతజ్ఞతలు తెలిపారు.



రాజుపాలెం- వీరవరం దారిలో గుంతలు పూడ్చుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

జగ్గంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేటకు చెందిన శ్రీదేవి స్వీట్‌స్టాల్ అధినేత దివంగత మజ్జి అప్పారావు(బాలు) జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ జగ్గంపేట మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మారిశెట్టి రాధా, డేగల సత్తిబాబు, ఎండీ కాజా, మంతెన రఘురామరాజు, కింగం రామకృష్ణ, రామకృష్ణ యాదవ్, పుర్రె వీరబాబు, శ్రీను పాల్గొన్నారు.

రౌతులపూడిలో అన్నదానం

రౌతులపూడి, మే 12 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో గ్రామదేవతలు చినవేములమ్మతల్లి, పెదవేములమ్మతల్లి ఆలయం వద్ద సోమవారం అన్నదానం గంధామావాస్యను పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహించగా బలరాపురం, గిడజాం, బంగారయ్యపేట, గుమ్మరేగుల తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వీకరించారు. అన్నదానాన్ని మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ప్రజా వేదికకు రెండు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఎంపీడీవో

గండేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు రెవెన్యూ సమస్యలపై 2 అర్జీలు వచ్చినట్టు ఎంపీడీవో కె.చంద్రరావు తెలిపారు. వచ్చిన అర్జీలు త్వరగా పరిష్కరిస్తామన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, పశువైద్య అధికారి సుప్రియ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధ్యానమందిరం ప్రారంభం

జగ్గంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లిశాల గ్రామ శివారున తపస్వీ యోగి సిద్ధ రామయ్య సిద్ధాశ్రమంలో నూతన ధ్యానమందిర ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. గ్రామ పెద్దలు, యోగులు, అధికంగా స్వామిజీ భక్తులు పాల్గొన్నారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు అభినందన

గండేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ నీలిమ ఇటీవల ఇండోనేషియాలో యోగ్యకర్తలో నిర్వహించిన త్రిశక్తి ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో గౌరవ అతిథిగా ప్రసంగించారు. నీలిమను యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బీ శ్రీనివాస్, ప్రొవైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ సురేష్ అభినందించారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించి ప్రత్తిపాడులో తుమ్మల లక్ష్మి, పెద్దిపాలెంలో గుబ్బల లక్ష్మి, నెల్లిపూడిలో కొయ్యాప్రసాద్‌లను 10లీటర్ల సారాతో అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ జ్ఞానశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు

ఏలేశ్వరం, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏఈ సూర్యనారాయణ విద్యుత్ కార్యాలయం వద్ద సుమారు 20 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అతి సామాన్య గిరిజనుడికి కూటమి అందలం

-ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా సాధారణ కార్యకర్త చోళ్ల బొజ్జిరెడ్డి నియామకం



బీజేపీ శ్రేణులతో చోళ్ల బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 12(ఆంధ్రజ్యోతి): బీజేపీలో అతి సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన ఓ గిరిజనుడికి కూటమి ప్రభుత్వం అందలమెక్కించి ఏకంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు చైర్మన్‌గా నియమించి అల్లూరి జిల్లాలో గిరిజన శ్రేణుల్లో జోష్‌ను నింపింది. రంపచోడవరం మండలం బోలగొండ గ్రామంలో కొండరెడ్డి తెగలో అతి సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉద్యోగాన్ని వదిలేసి బీజేపీ సభ్యత్వం తీసుకుని దేశంలో బీజేపీ హవా లేని రోజుల్లోనే ఇక్కడి బీజేపీ జెండాను ఒక్కడిగానే మోసి నేడు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. కేవలం పార్టీ భావజాలమే వంట పట్టించుకుని నేటికీ పలు చోట్లకు కాలినడకనే తిరిగే ఆయనకు ఎస్టీ కమిషన్ చైర్మన్ హోదా కల్పించడం పట్ల మన్యంలో అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొన్ని దశాబ్దాలుగా గిరిజన సమస్యలపై, హక్కులపై వివాద రహితుడిగా పోరాడుతూ వచ్చారు. బీజేపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా 2009లోనే పార్టీ ఆయనకు అవకాశం ఇచ్చింది. ఆ సమయంలో కూడా ఆయన నిరాడంబరంగానే కాలినడకనే పార్టీ కోసం గ్రామాల్లో సంచరించారు. 15ఏళ్లపైగా పార్టీలో ఆయన పొందిన గుర్తింపు ఆయనకు ఈ హోదాను తెచ్చి పెట్టింది.

ప్రజా సేవకు గుర్తింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పాయం వెంకయ్య

చింతూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా చోళ్ల బుజ్జిరెడ్డి నియామకం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామ రాజు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య సోమవారం చింతూరులో విలేకరులతో మాట్లాడారు. చోళ్లబుజ్జి రెడ్డి ఉపాధ్యాయ వృత్తిని వదులుకుని 20ఏళ్లుగా బీజేపీలో ఉంటూ ప్రజా సేవచేస్తున్నారని వెంకయ్య అన్నారు. పార్టీలో అంకిత భావంతో పనిచేసిన వారికి గుర్తింపు వస్తుందన్న వాదనకు చోళ్ల బుజ్జి ఒక ఉదాహరణ అన్నారు. వెనుకబడిన వర్గాల్లో ఒకటైన కొండరెడ్డి తెగను పార్టీ గుర్తించడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, మంత్రి మధుకర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీవీసస్ రమణారెడ్డి, నాయకులు కట్టం ముత్తయ్య, మూట మల్లేష్, మిడియం ప్రసాద్, సోడె వీరయ్య, జారి బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోళ్ల బొజ్జిరెడ్డి నియామకంపై బీజేపీ నాయకుల హర్షం

టీడీపీ నాయకుల హర్షం

దేవీపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలానికి చెందిన చోళ్ల బుజ్జిరెడ్డి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించడంపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరిశెట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంజం రాజామణి, మాగాపు బాబురావు, తైలం గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.